క్లుప్తంగా

వైభవంగా కుసుమ హరినాథ కల్యాణం



కుసుమ హరినాథ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: అంగరంగ వైభవంగా కుసుమ హరినాథ లీలా కల్యాణోత్సవం ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో నిర్వహించారు. కుసుమ హరనాథ భక్త బృందం నిర్వాహకులు కాకర్ల హరిదాసు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. హరినాథ లీలా కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం దివ్య హారతి అందజేశారు. కల్యాణాన్ని తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులకు భోజన, సకల వసతులు కల్పించారు.

బాబోయ్.. ఆకివీడు మేము రాము !

ఆకివీడు: మండల స్థాయి ఉద్యోగులు బదిలీ అయినప్పటికీ ఆ స్థానాల్లోకి బదిలీ అయిన ఉద్యోగులు వచ్చి బాధ్యతలు స్వీకరించడం లేదు. బాబోయ్ ఆకివీడు మేము వెళ్లలేము అంటూ రిలీవ్ ఆర్డర్లు తీసుకోవడం లేదు. దీంతో జిల్లా అధికారులు తలలు పట్టుకుంటున్నారు. బదిలీ అయిన స్థానాలను ఏ విధంగా భర్తీ చేయాలో అర్థం కాక అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక ఇక్కడి నుంచి బదిలీ అయిన ఉద్యోగులనే మళ్లీ డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఈ విధంగా మండల పరిషత్ లోని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గణపవరం, గ్రామీణ నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాలకోడేరు మండలాలకు బదిలీ అయి ఆయా ప్రాంతాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయలేక తిరిగి వారినే ఇక్కడకు డిప్యుటేషన్‌పై బాధ్యతలు స్వీకరించే విధంగా జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. మండలంలోని పలు శాఖల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

ముత్యాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. శరన్నవరాత్రులు పూర్తికావడంతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో ఎం.అరుణ్‌కుమార్, ఆలయ, చైర్మన్ కడలి మాణిక్యాలరావు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వదలని వరుణుడు



మొగల్తూరులో కురుస్తున్న వర్షం

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వాయుగుండంగా మారడంతో గత 5 రోజులగా మొగల్తూరు మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు తిరిగి మరోసారి అల్పపీడనం ఏర్పడటంతో ఆదివారం ఉదయం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పల్లపు ప్రాంతాలతో పాటు కేపీపాలెం, కాళీపట్నం, పేరుపాలెం, మొగల్తూరులోని ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులతో పాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో వేటకు వెళ్లే మత్స్యకారులతో పాటు రైతులు ఆందోళన చెందుతున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

పాలకొల్లు అర్బన్: డిప్లొమో ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా అసిస్టెంట్ ఇంజనీర్, పంచాయతీరాజ్, నరసాపురం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలకొల్లు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఈ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా డి.విశ్వనాథరాజు, జనరల్ సెక్రటరీగా ఎంవైఎస్ఎస్ఎస్ రాజు, ఫైనాన్స్ సెక్రటరీగా పి.చక్రధర్, సూర్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను ఇంజనీర్లు, సిబ్బంది అభినందించారు.

అమ్మవారి ఊరేగింపులు

మొగల్తూరు: దేవీ నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అమ్మవారి ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని ముక్కువారి వీధిలో నెలకొల్పిన అమ్మవారిని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. యువకుల నృత్యాలు, శక్తివేషాలు, బాణసంచా కాల్పులతో అమ్మవారిని ఊరేగించారు.

ఆదమరిస్తే ఉప్పుటేరులోకే !

- ప్రమాదభరితంగా ఉప్పుటేరు వంతెన
- ఏళ్లు గడిచినా మరమ్మతులకు నోచుకోని వైనం



ఉప్పుటేరు వంతెన అప్రోచ్ వద్ద పెట్టిన సిగ్నల్ బోర్డు



పాడైపోయిన ఉప్పుటేరు పిట్టగోడలు

ఆకివీడు: పురాతన వంతెనలకు కనీస మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు, వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏ క్షణంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళనతో వాహనాలను నడుపుతున్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దుగా ఉన్న ఉప్పుటేరుపై నిర్మించిన పురాతన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. వంతెనల పైభాగంలో ఉన్న పిట్ట గోడలు నామ రూపాలు లేకుండా పోయాయి. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఉప్పుటేరు వంతెన కిరువైపులా ఉన్న పిట్టగోడలు, అప్రోచ్ రోడ్డు ప్రమాద భరితంగా మారాయి. జాతీయ రహదారుల శాఖ స్వాధీనం చేసుకున్న ఆర్అండ్ బీ రోడ్డును 20 ఏళ్లుగా ఏ విధంగానూ అభివృద్ధి పరచలేదు. కనీసం రోడ్డు పునర్‌నిర్మాణం పనులు కూడా చేపట్టడం లేదు. దీంతో రోడ్లపై వెళ్లే వాహన చోదకులు నిత్యం ఆ శాఖ అధికారులపై దుమ్మెత్తి పోస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. తాము కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులమని, రాష్ట్ర ప్రజల సమస్యలను పరిష్కరించే ఖాళీ మాకు ఉండదనే వాదనతో ఆ శాఖ అధికారులు జాతీయ రహదారిని పట్టించుకోవడం లేదు. రోడ్డు దుస్థితి ఇలా ఉంటే ఉప్పుటేరుపై ఉన్న రెండు వంతెనల దుస్థితి మరీ అధ్వానంగా ఉంది. పిట్ట గోడలు, పూర్తిగా ధ్వంసమయ్యాయి. వంతెనకు ఉన్న అప్రోచ్ ప్రాంతం పశ్చిమగోదావరి జిల్లా వైపు కుంగిపోయింది. ఈ ప్రాంతంలో ఒకటి రెండు సార్లు వాహనాల ప్రమాదాలు సంభవించాయి. కైకలూరు వైపు ఉన్న అప్రోచ్‌రోడ్డులో వంతెనలకిరువైపులా ప్రమాదభరితంగా ఉన్నాయి. ఆ ప్రాంతంలో అధికారులు సిగ్నల్ ప్లేట్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి. వాహనచోదకులు అదమరిస్తే నేరుగా ఉప్పుటేరులోకి వాహనం చొచ్చుకుపోయే ప్రమాదం ఉంది. ఈ ప్రాంతంలో సిమ్మెంట్ దిమ్మలు అమర్చి, వాటికి రేడియేషన్ స్టిక్కర్లు అంటించాల్సి ఉంది. ప్రమాదాలు జరిగేంత వరకూ ఆ శాఖ అధికారులు స్పందించరనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వంతెనలకు వెంటనే పిట్ట గోడల మరమ్మతులు చేపట్టి, అప్రోచ్ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టూటౌన్ సీఐ కాళీచరణ్

భీమవరం: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ కాళీచరణ్ రౌడీ షీటర్లను హెచ్చరించారు. ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్ప్రవర్తనతో మెలగాలని, నేరాల నియంత్రణకు సహకరించాలని సూచించారు. నేరాలకు పాల్పడితే శాంతి భద్రతల పరిరక్షణకు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో విష్ణు విద్యార్థుల ప్రతిభ



శ్రీవిష్ణు ఉమెన్ ఇంజనీరింగ్ కళాశాల టీంకు మెమెంటోలు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: జేఎన్టీయూకే సెంట్రల్ జోన్ బ్యాడ్మింటన్‌లో మహిళల విభాగంలో భీమవరం విష్ణు ఉమెన్ ఇంజనీరింగ్ కళాశాల విజేతగా నిలిచింది. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. పోటీల్లో పురుషుల విభాగంలో మొదటి స్థానం నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు దక్కగా, మహిళల విభాగంలో మొదటి స్థానం భీమవరం శ్రీ విష్ణు మహిళ ఇంజనీరింగ్ కళాశాల టీంకు దక్కింది. విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీ కృష్ణంరాజు చేతుల మీదుగా విజేతలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. పురుషుల విభాగంలో రెండో స్థానంలో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, మూడో స్థానంలో కృష్ణా జిల్లా అమృత సాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, వీవీఐటీ కళాశాలకు సంయుక్తంగా దక్కిందని క్రీడల కమిటీ కన్వీనర్, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.సత్యనారాయణ రాజు తెలిపారు. మహిళల విభాగంలో ద్వితీయ స్థానం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు, మూడో స్థానం గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలకు, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలకు సంయుక్తంగా దక్కిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఎన్టీయూకే పరిశీలకులుగా డాక్టర్ సునీత, డాక్టర్ శరత్, ఇంజనీరింగ్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ హరి మోహన్, జి.సారిక, అవినాష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నిర్మూలనకు కృషి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆకివీడు: అంధత్వ నిర్మూలనకు లయన్స్ క్లబ్‌లు ప్రత్యేక కృషి చేస్తున్నాయని చినకాపవరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గొట్టుముక్కల జానకిరామరాజు (రాము) చెప్పారు. మండలంలోని చినకాపవరంలో ఆదివారం లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు కోల్పోకుండా ముందుగానే పరీక్షలు చేయించుకోవాలన్నారు. వయస్సు రీత్యా వచ్చే కంటి జబ్బులకు ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలన్నారు. శిబిరంలో 120 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 13 మందికి కంటి ఆపరేషన్లు చేయించుకోవాలని, మరో 9 మందికి కళ్లజోళ్లు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చినకాపవరం క్లబ్ కార్యదర్శి బండి బాలకృష్ణ, కోశాధికారి కె.వెంకన్న, ఏడుకొండలు, మద్రివాడ వెంకట్రావు, జవ్వాది నాగరాజు, నాగభూషణం, పి.రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

కాళ్ల: దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా కాళ్ల, కోపల్లె గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన రోడ్లన్నీ రానున్న నెల రోజుల్లోపు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు బందా విజయ, బూడి నాగమణి, టీడీపీ మండల అధ్యక్షుడు జీవి నాగేశ్వరరావు, ఉప సర్పంచులు పన్నాసి వెంకటేశ్వరరావు, బూడి వెంకటపరాలు, పెంట పాటి నాగేశ్వరరావు, బండారు సోమేశ్వరరావు, కడలి దుర్గాప్రదీప్, ఈవోపీఆర్డీ భాస్కరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ టి.శ్రీనివాసరావు, కార్యదర్శి బి.సతీష్, తదితరులు పాల్గొన్నారు.


హాస్టళ్ల తనిఖీ



విద్యార్థితో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సురేష్‌బాబు

వీరవాసరం: హాస్టళ్ల వరుస తనిఖీల్లో భాగంగా శనివారం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎ.సురేష్ బాబు వీరవాసరంలోని డివైన్ మెర్సీ హోంను సందర్శించారు. అదే విధంగా పాలకోడేరు మండలం కోరుకొల్లులో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని భీమవరం 2వ అదనపు జ్యూడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ డి.ధనరాజు సందర్శించారు. న్యాయమూర్తులు హాస్టళ్లలో ఉన్న స్థితిగతులను పరిశీలించారు. పిల్లల భోజనం మెనూ, రిజిస్టర్లు, వంటశాల, వాష్ రూమ్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు పి.అంబేద్కర్, బి.సురేష్ కుమార్, బి.లోకేశ్వరరావు, డి.రవికిరణ్, కె.జ్యోతి, ఎం.బి.భవాని, హాస్టళ్ల వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందిస్తున్న దృశ్యం

నరసాపురం: ఎన్ఆర్ఐ సంస్థల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాయల్స్ క్లబ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక తెలగ కల్యాణ మండపంలో అఖిల భారత కాపు, తెలగ, బలిజ సంఘం, మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రవాస భారతీయ స్కాలర్‌షిప్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ చినిమిల్లి మాట్లాడుతూ ఎంతోమంది ఉన్నత చదువులకు ఆర్థిక పరిస్థితులు అడ్డుపడుతున్నాయన్నారు. అటువంటి వారికి రాయల్స్ క్లబ్, మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ వంటి సంస్థలు సహకారం అందిస్తున్నాయని చెప్పారు. 76 మంది ప్రతిభ గల విద్యార్థులకు ఒకొక్కరికీ రూ.12 వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో మన అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఫౌండర్ అండ్ సెక్రటరీ రావు, అఖిల భారత కాపు, తెలగ, బలిజ సంఘం ట్రస్టీ సీహెచ్ గోపాలకృష్ణ, నరసాపురం రాయల్స్ క్లబ్ అధ్యక్షుడు జక్కం బాబ్జి పాల్గొన్నారు.

నేడు పాశుపతాస్త్ర హోమం

మొగల్తూరు: గ్రామంలో పడమటిపాలెం శివారు సుబ్రహ్మణేశ్వర ఆలయంలో సోమవారం పాశుపతాస్త్ర హోమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. విఘ్నేశ్వర పూజ, పున్యాహ వచనం, పంచగవ్యం పూజా కార్యక్రమాల అనంతరం శ్రీవల్లిదేవ సేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పాసుపతాస్త్రం హోమం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

వంగవీటి రంగా విగ్రహావిష్కరణ



వంగవీటి రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: వంగవీటి మోహనరంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. వీరవాసరం మండలం చింతలకోటి గరువులో నూతనంగా ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, వర్గాలకు అతీతంగా పేద వర్గాల పక్షపాతిగా ఉన్న వంగవీటి మోహన రంగా ప్రజలందరి మనసులో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, జెడ్పీటీసీ గుండా జయ ప్రకాష్ నాయుడు, కొల్లిపర శ్రీనివాసరావు, జవ్వాది బాలాజీ, గుండా రామకృష్ణ, ఎరకరాజు చినబాబు, వీరవల్లి చంద్రశేఖర్, నూకల అప్పాజీ, గుల్లిపల్లి విజయలక్ష్మి, యిర్రింకి మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఎన్ కళాశాలకు న్యాక్ గుర్తింపు



కరస్పాండెంట్‌కు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

భీమవరం: డాక్టర్ చీడే సత్యనారాయణ డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు న్యాక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) గుర్తింపు లభించిందని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ తెలిపారు. ఆదివారం కళాశాల వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాలలోని అన్ని వసతులను పరిశీలించి, విద్యార్థులు, తల్లిదండ్రులతో విడివిడిగా మాట్లాడి వారి అభిప్రాయాలను కళాశాలలోని వసతులను, విద్యార్థుల ఫలితాలు, ఉద్యోగ అవకాశాలను పరిశీలించి, నివేదికను న్యాక్‌కు అందించామన్నారు. నివేదిక ఆధారంగా బెంగళూర్ న్యాక్ గుర్తింపు వివరాలను మెయిల్ ద్వారా తెలియజేసి కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు అందించారని తెలిపారు. దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాలకు మంచి గ్రేడు రావడం చాలా సంతోషంగా ఉందని, దీనికి కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బందిని అభినందిస్తున్నామని, కళాశాలలో ఇప్పుడు గతంలో కంటే ఎంతో మెరుగుపరిచామన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎండీ సలీం ఖాన్, స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.నిర్మల, ఫార్మసీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, హెచ్‌వోడీ జీవీ రమణ, సీహెచ్ ఎస్.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

నరకానికి రహదారులు



చింతలకోటిగరువు- నవుడూరు జంక్షన్ రోడ్డులో వాహనదారుల కష్టాలు



మడుగుపోలవరం- కొణితివాడ వెళ్లే రహదారిలో గొయ్యి

గోతుల్లో పడి ఆసుపత్రి పాలవుతున్న వాహనదారులు

వీరవాసరం: భీమవరం నియోజకవర్గంలో ఎక్కడ చూసినా రహదారుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. అధికారం చేపట్టి నాలుగు నెలలు కావస్తున్నా రహదారుల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరవాసరం మండలంలో ప్రధాన రహదారిగా ఉన్న వీరవాసరం-పెనుమంట్ర రహదారిలో చింతలకోటి గరువు వంతెన వద్ద నుంచి నౌడూరు జంక్షన్ వరకు రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. రోడ్లపై ఎక్కడ చూసినా పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. కొద్దిపాటి వర్షానికి చెరువులను తలపిస్తున్నాయి. మడుగు పోలవరం నుంచి వయా కొణితివాడ మీదుగా నవుడూరు జంక్షన్ వరకు ఉన్న రహదారి సైతం గోతుల మయంగా ఉంది. తోలేరు చింత నుంచి పడమటి పాలెం మీదుగా వేండ్ర వెళ్లే రహదారి గోతులతో నిండి ఉంది. నడపనవారి పాలెం నుంచి రాయకుదురు మీదుగా చింతలకోటి గరువు వరకు వెళ్లే రహదారి సైతం పెద్దపెద్ద గోతులతో నిత్యం ప్రయాణికులకు అష్ట కష్టాలను చూపిస్తున్నాయి. వీరవాసరం నుంచి మెంటేపూడి వెళ్లే రహదారి, బొబ్బనపల్లి నుంచి మెంటేపూడి వెళ్లే రహదారి, మెంటేపూడి నుంచి బాలేపల్లి వెళ్లే రహదారి, బాలేపల్లి నుంచి దూసనపూడి వెళ్లే రహదారి, మత్స్యపురిపాలెం నుంచి కమతాలపల్లి వెళ్లే రహదారి పెద్ద పెద్ద గోతులతో భయానకంగా తయారయ్యాయి. రహదారులపై ప్రయాణిస్తున్న సమయంలో ప్రయాణికులు తమ వాహనాలు అదుపు తప్పి ఆసుపత్రి పాలైన సంఘటనలు కోకొల్లలు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు రహదారులపై దృష్టి కేంద్రీకరించికపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బిక్కుబిక్కుమంటూ వెళుతున్నాం

భీమవరం నియోజకవర్గంలో ముఖ్యంగా వీరవాసరం మండలంలో రహదారులు గోతుల మయంగా ఉన్నాయి. నౌడూరు జంక్షన్ నుంచి కొణితివాడ వెళ్లే రహదారి, చింతల కోటి గరువు నుంచి నవుడూరు జంక్షన్ వరకు ప్రధాన రహదారులు పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా ఉన్నాయి. ద్విచక్ర వాహనంపై ఆ రహదారిలో వెళ్లాలంటేనే భయం భయంగా, బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తుంది. వర్షం వస్తే ఇంకా అంతే సంగతులు. ఎక్కడ గొయ్యుందో తెలియని పరిస్థితి.

–తాడాల దుర్గా వరప్రసాద్, కొణితివాడ

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశంచౌక్): మావుళ్లమ్మకు సామర్లకోటకు చెందిన రామలక్ష్మణ మూర్తి సులోచన రాణి దంపతులు 4 గ్రాముల బంగారం ఆదివారం కానుకగా అందజేశారు. వీరికి ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ ప్రసాదం శేష వస్త్రం అందజేశారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తామని చైర్‌పర్సన్ జామి హైమావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ హాలులో జరిగే అత్యవసర సర్వ సభ్య సమావేశానికి కౌన్సిలర్లు తప్పనిసరిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి: మండలం కలిగొట్ల గ్రామంలో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.95,000 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నసీరుల్లా తెలిపారు.

ఆహ్లాదకరంగా గ్రామీణ ఆటల పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న యూత్ కబడ్డీ సభ్యులు

ఉండి: ఆంధ్రా ఇవాంజలికల్ లూథరన్ చర్చ్ (ఏఈఎల్‌సీ) సంస్కరణ దినోత్సవం మతోద్ధరణ పండుగను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే గ్రామీణ క్రీడలు ఆదివారం ఉండి మండలం ఎన్నార్పి అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు కబడ్డీ, త్రీ లెగ్‌డ్ రేస్, రన్నింగ్ పోటీల్లో పాల్గొన్నారు. అలాగే సండే స్కూల్ చిన్నారులు పలు క్రీడల్లో పాల్గొన్నారు. స్త్రీ, పురుషులకు బైబిల్ క్విజ్, బైబిల్ పరీక్ష, బైబిల్ క్విక్ రిఫరెన్స్, పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, కార్యదర్శి, కోశాధికారి, యూత్, సండే స్కూల్ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా గొంతేలమ్మ ఉత్సవం



పెనుగొండలో గొంతేలమ్మ గ్రామోత్సవం

పెనుగొండ: గొంతేలమ్మ గ్రామోత్సవం పెనుగొండలో అంగరంగ వైభోగంగా నిర్వహించారు. ఆదివారం పెనుగొండ దక్షిణపేటకు చెందిన గౌతమి యూత్ ఆధ్వర్యంలో ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. నెల రోజులు పూజలందుకున్న గొంతేలమ్మను దసరా అనంతరం గ్రామంలో ఊరేగించడం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం నుంచి పూజలు నిర్వహించి, అనంతరం బాణసంచా కాల్పులు, వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీవో దాసి రాజు చెప్పారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటల నుంచి అందించాలని చెప్పారు.